శుద్ధ...దేశభక్తుడు

# మా వీరయ్య మామ

మత్తి వెంకట్రామయ్య

మా వీరయ్య మామ అంటే మాచుట్టుపట్ల పెద్దపేరు. మామ అంటే నాకు మేనమామని కాని, పిల్లనిచ్చిన మామనికాని అనుకోవద్దు. మా వూరంతా మామ అంటారుగనుక నాకుకూడా మామ అయ్యాడు. ఈ ఇరవయ్యో శతాబ్దంలోకూడా రేడియోలుకాని, రైళ్లుకాని, పోస్టాఫీసులుగాని లేనిచోట-కనీసం మూడు రోజులకైనా పత్రికలు చేరనిచోట-ప్రపంచంఅంతా యింగ్లీషు అల్లుకుపోయినప్పటికీ స్వరాజ్యం వచ్చేవరకు యింగ్లీషు చదువులవాళ్లు లేని-చోట మా వీరయ్యమామవంటి దేశ భక్తుడు-రాజకీయజ్ఞుడు వున్నాడంటే చాలామందికి ఆశ్చర్యం వేస్తుంది. ఇట్లాంటి మారుమూల వున్న మా వీరయ్యమామను గురించి అతిశయోక్తిగా డబ్బా వాయిస్తున్నాననుకోవద్దు. ముందు ముందు గొప్పదేశభక్తుల జాబితాలో మావీరయ్య మామకూడా వస్తాడు - రావాలికూడా. అందుకోసం ఆయన జీవితంలో మణిపూసలాంటి ఘట్టాలు కొన్ని తెలుసుకోవటం ఎందుకైనా మంచిది.

ఆయన జన్మపై నుదహరించిన ప్రదేశంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో. అప్పట్లో గొప్పవాడౌతాడని తెలీకపోబట్టి పుట్టిన పండుగ చేసుకోలేదు. చిన్నతనంలో పెద్దబాలశిక్ష,లంకాయాగమూ,కామమ్మ కథా క్షుణ్ణంగా వల్లెవేశాడు-వీటిల్లో అర్థాలుకూడా అందరికీ చెప్పగల సమర్థుడు. ఇంతమాత్రంచేత మావీరయ్య మామకు డిగ్రీ లేదని గొప్పవాడు కాదనుకుంటారేమో! ఆయన తెలివితేటలు చూస్తే డిగ్రీలు అనవసరం అనిపిస్తుంది.

ఆస్తికమించిన అప్పుచేసి ముసలాడుపోగా-తన సొంత కిటుకుతో అప్పులవాళ్ల పేచీలకు మదత పేచీలు వేసి పిత్రార్జితం నిలుపుకొని, లంకా డొంకా యింకో మూడు ఎకరాలు సంపాదించి మావూళ్లో ఒక పెద్ద రైతు అనిపించుకున్న తరువాత ఆయన తెలివితేటలు నలుగురి నోట్లో ఆడటం మొదలెట్టేయి. అత్తా కోడండ్ర పోట్లాట మొదలు కొట్లాటలు-కోర్టు వ్యవహారాలవరకూ అన్నిట్లో మా వీరయ్య మామ పరిష్కారాలు వుభయులూ అంగీకరిస్తారు. ఇచ్చి పుచ్చుకోవటాలకు, వియ్యమందటాలకు మా వీరయ్యమామ లేనిదే ఏ కార్యం గట్టెక్కదు.

వీరయ్య మామ గొప్ప దైవభక్తుడని కూడా ప్రతీతి. మావూరులో పది ఎకరాలు మాగాణి గల దేవాలయానికి ధర్మకర్త. ప్రతి శ్రీరామనవమికీ భార్యాభర్తలు పీటలమీద కూర్చుని- కొద్దిపాటి సంతర్పణలు చేయించి- కూచిపూడి భాగవతుల్ని ఆడించి తమ దైవభక్తి రుజువు చేసుకుంటూ వుంటారు. కాని పది పదిహేను సంవత్సరాల నుండీ దేవాలయం మీద వస్తున్న ఆదాయం లెక్కచెప్పకుండా కొద్దో గొప్పో ఖర్చు పెట్టి మిగిలింది తన సొంతం చేసుకున్నాడనీ, ఆ డబ్బుతో బాగుపడ్డాడనీ ఆయన వ్యతిరేక వర్గం ఒక దుమారం లేవనెత్తారు. ఇందులో కొంత యథార్థం లేకపోలేదని అభిజ్ఞు లంటారు.

మా వీరయ్య మామకు దేశభక్తి ఎవరు నూరిపోశారో కాని కత్తీలేని గోనె పట్టా మార్కు శుద్ధ ఖద్దరు దేశభక్తుడుగా తయారయ్యాడు. ఆయన దేశభక్తికి మొదటి ఉదాహరణ యింటి నిండా నాయకుల బొమ్మలు. ఉప్పుసత్యాగ్రహం రోజులనుంచీ ఆయన బుర్రలో దేశభక్తి ప్రవేశించిం దంటారు. ఒకమారు గాంధీగారు మా పక్కవూరు వచ్చినపుడు నాలుగు చిలకలు ఆయన మెళ్లో వేసి తృప్తిచెంద లేకపోయాడు. భార్య గొలుసూ, గాజులూ తీసి యిప్పించేవాడే. కాని ఆవిడ కానుపుకోసం పుట్టింటి కెళ్లింది. గాంధీగారు హత్య చేయబడినప్పుడు భోజనం లేకుండా ఏడ్చి ప్రాణం పోగొట్టుకోబోయిన గాంధీ భక్తుడని చాలామందికి తెలుసు— కాని రహస్యంగా భార్య రెండు మొక్కజొన్న

కందెలు కాల్చియిస్తే తిని, కొంచెం మజ్జిగ త్రాగి క్షుద్బాధ తీర్చుకున్నాడని పక్కింటి వాళ్ళు చెవులు కొరుక్కుంటూ వుంటారు. ఎందరేమనుకున్నా మా వీరయ్య మామ దేశభక్తుడి కిందే లెక్క—

స్వరాజ్యం వచ్చిం తరువాత మా మామ హోదా కొంచం పెరిగి బుద్ధిలో కూడా మార్పు వచ్చిందంటారు. ఇప్పుడాయన చిన్న చిన్న గ్రామ వ్యవహారాలు తగ్గించుకుని ఆ కార్యక్రమం దేశవ్యవహారాలకు వుపయోగిస్తున్నాడు. ఫుడ్ కమిటీలు అధికారం చెలాయించే రోజుల్లో మా వీరయ్య మామ కమిటీ ప్రెసిడెంటు. గ్రామస్థులందరికీ గుడ్డ- శనగలు సక్రమంగా పంచలేదని, వ్యాపారస్థులతో లాలూచీ వుందని ఎవరైనా చాటున అనుకున్నప్పటికీ వీరయ్యమామకు ఏమీ కష్టంలేదు. బస్తీ నుంచి మా వూరుకు కంకరరోడ్డు వేయించడానికి ఎన్నోమార్లు జిల్లాబోర్డులచుట్టూ చందాల సొమ్ముతో తిరిగి ఆలోచిస్తామని బోర్డువారిచేత అనిపించుకునేవరకూ నిద్రపోలేదు. మా వూరు పెద్దకాలవ వంతెనకోసం వూళ్ళో డబ్బు ఖర్చు పెట్టించి చెన్నపట్నం చుట్టూ చాలామార్లు తిరిగి కూడా పనిచేయించలేదని మా మామ మీద కొంతమందికి కోపం వచ్చింది. మంత్రులు, ఆఫీసర్లు తన చేతిలో వాళ్ళని చెప్పుకుంటున్న మా వీరయ్య మామను ఒత్తిడిచేసి అడిగేధైర్యం మా వూళ్ళో ఎవ్వరికీ లేదు. చివరకు గ్రామకంటకం రెండు ఎకరాలు తన సొంత పొలంలో కలుపుకున్నప్పటికీ మునసబు కర్ణాలకి కాని, గ్రామస్థులికి కాని అదేమని అడిగేదమ్ములు లేకపోయాయి.

మా వీరయ్య మామకు ఆంధ్రప్రభ రాజకీయాలు పూర్తిగా తెలుసుకాని, మిత్రరాజ్యసమితి తీర్పులతో కాని, అమెరికా అప్పులతో, యూరప్ వ్యాపారపు మార్పులతో, చివరకు కాశ్మీరు సమస్యతో కాని ఎట్టి సంబంధమూ పెట్టుకోడు. ఒక్క మాటలో చెప్పాలంటే మా వీరయ్య మామకు అంతర్జాతీయ కితకితలు లేవు. కాని యీ మధ్య హింసావాదులు చెలరేగిన దగ్గర నుండీ వాళ్ళను తిట్టే కొన్ని మాటలకోసం తాపత్రయపడుతున్నాడు. మా వూరు జమీందారీ గ్రామం కావటంవలన బ్రహ్మేంద్రాదులు అడ్డు వచ్చినా జమీలు రద్దుచేస్తామన్న ప్రధాని ఆంధ్రప్రభవాక్యాలతో మా వూరు రైతులకు ఉపదేశించి తృప్తిపరుస్తాడు. పంచాయితీ బిల్లును గురించి కలలు కంటాడు. మా వీరయ్యమామ పేరు ప్రతిష్ఠలు, దేశభక్తి చుట్టుపట్ల గ్రామాలకు విద్రోహుల్ని పట్టించటం ద్వారా వ్యాపించినయి. అరాజకచర్యలను అణచటానికి ఏర్పాటు చేయబడ్డ ఒకటి రెండు మీటింగులకు అధ్యక్షుడై అపస్వరాల వుపన్యాసాలు చెయ్యడంతో మా వీరయ్యమామ పలుకుబడి బాగా పెరిగిపోయింది.

మా వీరయ్య మామమీద యీమధ్య యింకో దుమారం లేచింది. ప్రొహిబిషన్ అమల్లో వున్నప్పటినుండీ రహస్యంగా, తన ఆంతరంగిక వ్యవహారాలు నడుపుతున్న ఒక వితంతువు యింటిలో, సారాయి తయారు చేయిస్తున్నాడనీ-; జమీందారు అమ్ముకొంటున్న పొలాలు ఎవ్వరూ కొనవద్దని హెచ్చరిస్తూ, తనకు రహస్యంగా జమీందారువల్ల లభించిన ఐదు ఎకరాలు కాక యింకో పది ఎకరాలు కొని యీ మొత్తం ఆయన దూరపు బంధువు ఎవరో కొన్నట్లు ప్రచారం చేసుకుంటున్నాడనీ; యిట్లాంటిపనులు దేశభక్తులకు ప్రజాసేవకులకు తగవనీ లకోటా వుత్తరాలు రాసాగాయి. అయితే అవి చూసి మామ ఏమీ లక్ష్యపెట్టేవాడు కాదు.

"గిట్టనివాళ్లు కొంతమంది ఆయన వుచ్చస్థితిని చూచి ఓర్వలేక పై అభూతకల్పనలు చేస్తున్నారు కాని-వీరయ శుద్ధ దేశభక్తుడు, స్వార్థరహితుడు"-అంటూ ఆయన శిష్యకోటి బహుళ ప్రచారంచేసి కళంకరహితుణ్ణి చేస్తూవుంటుంది. మా వీరయ్య మామ కూడా చెన్నపట్నం వెళ్లి యిదంతా అరాజకవాదుల కుట్రని చెప్పి ఒప్పించి వచ్చాడు. ఇప్పుడు మా వీరయ్య మామ అంటే ఆ చుట్టుపట్ల పెద్ద పేరు లెండి. మా వీరయ్య మామ ముందు ఎప్పుడైనా మంత్రికూడా ఔతాడు. అప్పుడు మావూరులో ఆయన పేరుతో సత్రం కట్టించి, ఆయన నిలువెత్తు ఫోటో కాని - పోత విగ్రహం కాని సత్రంలో పెట్టించి, వీరయ్య మామ వంటి దేశభక్తుడు లేడు లేడటంచు ముందు యుగముల ప్రజలు తల లూపేటట్టు చేయించుకునే సూచనలుకూడా వున్నాయి.